క్లుప్తంగా

బీసీ ధర్నాకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత కోరారు. సోమవారం మార్కెట్‌యార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, కానీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని ఆరోపించారు. అడ్డుకునేవారంతా చరిత్రలో బీసీ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. రిజర్వేషన్ల బిల్లు అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దేశ రాజధానిలో ధర్నా చేపట్టామని, కార్యక్రమానికి బీసీలు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, నాయకులు ఖాదర్‌ఖాద్రి, దళపతిగౌడ్, కృష్ణనాయక్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, విజేందర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న దాత రామునాయక్

కడ్తాల్: మండల పరిధి గానుగుమార్లతండా గ్రామ పంచాయతీ కానుగుబావితండాలో నిరిస్తున్న తుల్జా భవానీ ఆలయానికి గోవిందాయిపల్లితండా మాజీ సర్పంచ్ రామునాయక్ రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. సోమవారం ఆలయ నిర్వాహకులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు బీచ్యానాయక్, దేవ్యులా, జాన్య, పాండు, లక్ష్మణ్, శంకర్, కిషన్, వినోద్, రమేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

సీడీపీఓ వినీతాదేవి



అన్నప్రాసన చేయిస్తున్న వినీతాదేవి

ఇబ్రహీంపట్నం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, దాంతో పాటే అదనంగా పోషకాహారాన్ని అరు నెలలు నిండిన పిల్లలకు అందించాలని ఇబ్రహీంపట్నం సీడీపీఓ వినీతాదేవి అన్నారు. ప్రాజెక్ట్ పరిధి నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు అందజేసే బాలమృతాన్ని నిత్యం 100 గ్రాములు బిడ్డకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పల్లవి, అంగన్‌వాడీలు విజయలక్ష్మీ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



అందజేసిన పెయింట్ డబ్బాలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం రూ.1లక్ష సాయం అందించారు. గతంలో రూ.50 వేలతో పాఠశాల ఆవరణలో వేదిక నిర్మించారు. ప్రస్తుతం ప్రహరి నిర్మాణం, పాఠశాలకు రంగులు తదితర సామగ్రికి నిధులు సమకూర్చారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన విలేకరి కోట్ల వెంకటేశ్ తల్లి కృష్ణమ్మ సోమవారం ఉదయం మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. ఇందులో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మార్కెట్ చైర్మన్ యాట గీత, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ ఉన్నారు.



మంగళపల్లిలో వరిసాగు



మేడిగడ్డలో మొక్కజొన్న పంట

విస్తారంగా వర్షాలు..
విస్తృతంగా పంటలు

పచ్చదనంతో కళకళలాడుతున్న పల్లెలు

- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆమనగల్లు: తొలుత వరుణుడి కోసం ఆకాశం వైపు దీనంగా చూసిన అన్నదాతలు.. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలం ఆలస్యమైనా.. పాడిపంటలతో పల్లెలు కళకళలాడుతుండటంతో పరవశించిపోతున్నారు. పది రోజుల క్రితం కురిసిన వర్షాలు పంటలకు జీవం పోయగా.. అవి ప్రస్తుతం ఏపుగా పెరిగి దిగుబడులపై రైతులకు ఆశలు పెంచాయి.

9,568 ఎకరాల్లో సాగు

వానాకాలం సీజన్‌లో రైతులు 9,568 ఎకరాల్లో వివిధ రకాల పంటలను వేశారు. ఇందులో 850 ఎకరాల్లో మొక్కజొన్న, 7,658 ఎకరాల్లో పత్తి, 523 ఎకరాల్లో జొన్న, 35 ఎకరాల్లో కందులు, 2 ఎకరాల్లో ఆముదం, 500 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో తొలకరి జల్లులకు రైతులు విత్తులు విత్తారు. ఆ తరువాత సకాలంలో వానలు పడకపోవడంతో ఆందోళన చెందారు. ఆలస్యంగానైనా కురిసిన ముసురు వర్షాలు పంటలకు ప్రాణం పోయగా.. అన్నదాతలు ఆనందంగా పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు

పాల్గొన్న తాజామాజీ ప్రజాప్రతినిధులు



పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

కడ్తాల్: మండల పరిధి ఏక్వాయిపల్లిలో రేణకా ఎల్లమ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రెండో రోజు సోమవారం యజ్ఞ యాగాలు నిర్వహించారు. వేడుకలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సీఐ గంగాధర్, ఎస్‌ఐ వరప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ.10 వేలు, మహేశ్ యాదవ్ రూ.50 వేలు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా రూ.10 వేలు, దశరథ్‌నాయక్ రూ.11 వేలు, ఆనంద్ రూ.30 వేలు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ రూ.5 వేలు, లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వీరయ్య, మాజీ సర్పంచ్ సుగుణ, మాజీ ఎంపీటీసీ ఉమావతి, నాయకులు కరుణాకర్‌గౌడ్, యాదయ్యగౌడ్, సుమన్, శంకరయ్య, రమేశ్, మధు, విగ్రహ దాత కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓరియంటేషన్ డే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్‌రావు తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి గుంతపల్లి గ్రామం అవంతి విద్యాసంస్థల ఆవరణలో సోమవారం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ డే ఘనంగా జరిగింది. విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా జేఎన్టీయూ హైదరాబాద్ డైరెక్టర్ ఎంవీఎస్ఎస్ గిరిధర్, కంప్యూటర్ సైన్స్ విభాగం హెచ్ఓడీ సుప్రీతి, టీసీఎస్ డెలివరీ హెడ్ సుబ్రహ్మణ్యం, బ్రహ్మకుమారీస్ రుచీ సిస్టర్, విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంకలు పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధ్యాపకులు బోధించే విషయాలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ శేషతల్పసాయి, ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించండి



కమిటీని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కడ్తాల్: చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తి భావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలో శ్రీనివాస్‌గౌడ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీని నియమించారు. కమిటీ చైర్మన్‌గా వినోద్‌నాయక్, వైస్ చైర్మన్‌గా నరేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రామునాయక్, కార్యదర్శిగా సుధీర్‌నాయక్, కోశాధికారిగా తులసీ రాంనాయక్, 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ చైర్మన్ హీరాసింగ్, వైస్ చైర్మన్ రామునాయక్, యాదగిరిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసీరాం, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, జవహర్‌లాల్, దుద్యానాయక్, హీరాసింగ్, యాదగిరి, రాము, భోని శంకర్ తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఏకం కావాలి



జెండాను ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

మంచాల: హక్కుల సాధనకు బీసీలు ఏకం కావాలని మన ఆలోచన సాధన సమితి నాయకుడు గోరె వీరేష్ గౌడ్ అన్నారు. సోమవారం తిప్పాయిగూడ గ్రామంలో సాధన సమితి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురయ్యారని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా హక్కులు సాధించుకోవాలని, అందుకోసం ఏకమై.. కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, మల్లేశ్, చంద్రయ్య, జంగయ్య, కొమురయ్య, యాదయ్య, కిష్టయ్య, నర్సింహ, బాలరాజ్, శ్రీనివాస్ గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



మాట్లాడుతున్న విద్యాసంస్థల వైస్ చైర్మన్

ఇబ్రహీంపట్నం: పట్టుదల, క్రమశిక్షణతో చదివి, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని శ్రీ దత్త విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్‌వీ వైభవ్‌రెడ్డి, సీఎండీ దేవేంద్ర విక్రమ్‌రెడ్డి, డైరెక్టర్ డా.సంతోష్‌కుమార్‌లు అన్నారు. శేరిగూడ శ్రీ దత్త విద్యాసంస్థలో సోమవారం డిప్లొమా విద్యార్థుల ఓరియెంటేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యను పూర్తి చేసిన విద్యార్థులు వృత్తిపరమైన విద్యాభ్యాసంలోకి అడుగుపెడుతున్నారని తెలిపారు. ఈ డిప్లమా విద్య వారి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కొత్త ప్రయాణంలో జీవిత పాఠాలు నేర్చుకొని, వృత్తిపరంగా ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ వెంకట అచ్యుతరావు, ప్రిన్సిపాల్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్

ఆమనగల్లు: హరిత ఆమనగల్లు లక్ష్యంగా రేపటి నుంచి ఇంటింటికీ 6 మొక్కలను పంపిణీ చేయనున్నామని మున్సిపల్ కమిషనర్ శంకర్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని వన నర్సరీని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణ, ముంగిట్లో మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల 6,7,8 తరగతుల విద్యార్థులకు 7న బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. ఇందులో పట్టణీకరణ సవాళ్లు, స్మార్ట్ పరిష్కారాలు అనే అంశంపై పోటీ ఉంటుందన్నారు. చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు.

ఏపీఎంకు సన్మానం



సాంబశివుడిని సన్మానిస్తున్న మహిళా సంఘాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల డీఆర్‌డీఏ ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన సాంబశివుడిని సోమవారం మహిళా సంఘాలు, సీసీలు, వీఓఏలు ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఇంతకు ముందు పనిచేసిన రవీందర్.. యాచారానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సాంబశివుడు మాట్లాడుతూ.. కొత్తగా మహిళ, దివ్యంగులు, వృద్ధాప్య సంఘాల ఏర్పాటుకు కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు సెర్ప్ ఆదీనంలో మహిళల అభివృద్ధికి పాటు పడదామని చెప్పారు. సంఘం వీఓఏలు, సీసీలు రమాదేవి, బాలమణి, లత, శ్రీనివాస్, పర్విన్, ఆనంద్, చంద్రిక ఉన్నారు.

నేడు వాహనాల వేలం

యాచారం: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు మంగళవారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నామని సీఐ సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పాట జరగనుందని, ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.5 వేల డీడీ అందజేసి, వేలంలో పాల్గొనాలని సూచించారు.

కమీషన్ల కోసం పనిచేసిన బీఆర్‌ఎస్

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి గొర్రె పిల్లను బహూకరించిన యాదవ సంఘం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: పదేళ్లు పరిపాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకోసం కాకుండా కమీషన్ల కోసం పనిచేస్తే.. తాము ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్, గుంతపల్లి, మజీద్‌పూర్ గ్రామాల్లో రూ.80 లక్షలతో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, అర్హులందరికీ అందజేస్తున్నామని తెలిపారు. రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనాజ్‌పూర్ మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని, పూజలు చేశారు.

ఉచిత వైద్య సేవలు 'ఐక్యత' లక్ష్యం

టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి



హెల్త్‌క్యాంపు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో 2028 సంవత్సరం చివరి నాటికి లక్ష మందికి ఉచితంగా వైద్య పరీక్షలు అందించడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని టాస్క్ సీఓఓ, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వన్ మెడిహబ్ సంస్థ సహకారంతో మొబైల్ వ్యాన్ ద్వారా హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాల్లో లివర్, కిడ్నీ, గుండె, కొలెస్ట్రాల్, కాల్షియం, షుగర్ తదితర పరీక్షలు చేస్తామని చెప్పారు. వారానికి ఒకరోజు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా రేపు మండల పరిధి మేడిగడ్డ తండాలో మొబైల్ క్యాంపును ప్రారంభించనున్నామని తెలిపారు. ఫౌండేషన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం హెల్త్ క్యాంపు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వన్ మెడిహబ్ ఫౌండర్ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, నాయకులు మల్లేశ్, అభినవ్‌రెడ్డి, కృష్ణాయాదవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఇచ్చిన మాటను నిలుపుకోవాలి
- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి డిమాండ్
- బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఆచారి

కడ్తాల్: ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాలని, వికలాంగుల ఆసరాను రూ.6 వేలు పెంచి ఇవ్వాలని కోరారు. మహిళలకు నెలకు రూ.2500, ఆడ బిడ్డల వివాహాలకు తులం బంగారం ఇవ్వాలన్నారు. రైతుభరోసా సరిగా ఇవ్వలేదని, రుణమాఫీని అర్హులందరికీ చేయలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ కారులకు రూ.25 వేల పింఛన్ ఇస్తానని ఇవ్వలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, నాయకులు సాయిలాల్, మాన్యనాయక్, భగీరథ్, శంకర్ నాయక్, శ్రీశైలంగౌడ్, యాదగిరి, వెంకటేశ్, విక్రం తదితరులు ఉన్నారు.

కేంద్రం నిధులతోనే పథకాల అమలు

- బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి
- ఇంటింటికీ కమలనాథుల ప్రచారం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం మొండిగౌరెల్లి గ్రామంలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని, ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపే చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు.. పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు బీజేపీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, మండల మాజీ అధ్యక్షుడు రవీందర్, నాయకులు మల్లారెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, జంగయ్య, సందీప్ రెడ్డి, వెంకటేశ్, నరేష్, సత్తయ్య, మల్లేశ్, లక్ష్మయ్య, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత

- మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మహిళలకు కుట్టు మిషన్ల అందజేత



ఆమనగల్లు: మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద క్రైస్తవ మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 567 కుట్టు మిషన్లు పంపిణీ చేశామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, మాజీ ఎంపీపీ అనిత, ఎంపీడీఓ మహ్మద్ రెహ్మాన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వం లక్ష్యమని, పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో వైద్య సేవలందించేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి కొండ్రిగానిబోడ్‌తండాకు చెందిన సభవట్ పిప్లీకి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.26 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం నగరంలోని తన నివాసంలో బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, నాయకులు జైపాల్‌రెడ్డి, బిక్కునాయక్, రఘురాములు, మల్లారెడ్డి, రాజు, సురేశ్, గోజీ ఉన్నారు.

వైద్యుడిని నియమించాలి

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యుడిని నియమించాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం నగరంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు లేక.. పేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని, డాక్టర్‌ను నియమించాలని కోరారు. మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, నాయకులు బిక్కునాయక్, సురేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.